ప్రజాశక్తి

ఆదివారం 8 డిసెంబర్ 2024

అల్లూరి సీతారామరాజు

730 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : ఒడిశా రాష్ట్రానికి చెందిన మారుమూల పనసపుట్టు పంచాయతీ కొర పుట్టు బ్లాక్ కు చెందిన పలువురు 730 కిలోల గంజాయిని తరలిస్తుండగా లబ్బూరు జంక్షన్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామకృష్ణ అందించిన వివరాలు.. విశ్వసనీయత సమాచా రంతో లబూరు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పనసపుట్టు పంచాయతీ సింగోయ్ గ్రామం నుండి బొలెరో వాహనంలో 730 కిలోల గంజాయిని తరలిస్తుండగా ముగ్గురు నిందితులను, ఒక బోలోరో వాహనాన్ని పట్టుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

నిందితులతో పోలీసులు

విద్యా ప్రమాణాల మెరుగుకు పటిష్ట చర్యలు

-జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ -పలు పాఠశాలల్లో పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశాలు

కొయ్యూరు మండలం డౌనూరులో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- కొయ్యూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని డౌనూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే భవిష్యత్తులో ఏం అవ్వాలో నిర్ణయించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువులను సామర్థ్యాలను పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్లు ఉంటున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో రేటింగ్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం రంగవల్లులు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ బ్రహ్మాజీ రావు, ఎటిడబ్ల్యూ ఓ క్రాంతికుమార్, ఎంఈఓ రాంబాబు, ఎంపీపీ రమేష్, హెచ్‌ఎం ప్రభుదాసు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థల్లో పటిష్టమైన సంస్కరణలను తీసుకొస్తుందని జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల -1లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతిరోజు పదిమంది యువకులపై గంజాయి కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో మిరియాలు, రాజ్మా సాగు, సిల్వర్ ఓక్, కాఫీ సాగుకు ప్రసిద్ధి చెందాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో ప్రతి గ్రామం కాఫీకి ప్రసిద్ధి చెందాలని గంజాయిని నిర్మూలించాలని సూచించారు.

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. పిల్లల మంచి అలవాట్లు చెడు అలవాట్లు తల్లిదండ్రులు గమనించాలన్నారు. అంతకుముందు గంజాయి నివారణపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.

అనంతరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్‌లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు.గత ఏడాది ఇదే స్కూల్లో సూపర్ 50 కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. 21 సంవత్సరాలు నిండే వరకు వివాహాలు చేసుకోకూడదని సూచించారు. ఇంజనీరింగ్ ,మెడికల్, గ్రూప్ వన్, గ్రూప్ 2, సివిల్స్ సర్వీసెస్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి వెంకటరమణ, డిఎస్పి ప్రమోద్, సీఐ జీనబంధు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, డాక్టర్ అబ్దుల్ బషీర్ , విద్యా కమిటీ చైర్పర్సన్ పోతు రాస దాసమ్మ, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాడేరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి అమిత్ బర్ధార్

పేరెంట్, టీచర్ సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కోతుల గుట్ట గురుకులంలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల ఆత్మీయ సమావేశాన్ని తల్లిదండ్రులు బహిష్కరించారు. లెక్చరర్లు, ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు అగమ్య గోచరంగా మారిందని తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేసారు. ఏపి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని బహిస్కరించి రోడ్డుపై కూర్చొని తమ నిరసన వ్యక్తం చేసారు. వెంటనే అధ్యాపకులను కేటాయించాలని డిమాండ్ చేసారు.

ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

తనపైనా, తన భర్తపైనా జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి నియోజకవర్గ ప్రజలను కోరారు. దీనికి సంబంధించి శనివారం ఆమె ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. తన పేరు గాని, తన భర్త భాస్కర్ పేరు గాని చెప్పి ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, అక్రమంగా ఎటువంటి వసూళ్లు చేసినా వెంటనే విషయాన్ని తమకు తెలియజేయాలని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎటపాక మండలం గుండాల ఇసుక ర్యాంప్ వద్ద తన చెప్పానని చెప్పి ఇసుకను అక్రమంగా రవాణా చేసి కొందరు వ్యక్తులు అమ్ముకుంటున్నట్లు తనకు ఫిర్యాదు వచ్చిందని, తాము ఎవరికీ ఏమీ చెప్పలేదని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారికి తమకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే గిరిజనేతరులపై ఎల్‌పిఆర్‌పి కేసులు నమోదు చేయించి, వాటిని ఉపసంహరించుకునేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. తాను ఎన్నికల సమయంలో గిరిజనులకు, గిరిజనేతరులకు వ్యతిరేకం కాదని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానన్నారు. ఇటీవల దేవీపట్నం మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలలో చేపల వేట చేసుకునేందుకు జాలర్ల వద్ద నుండి తాము అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు సత్యదూరమన్నారు. విలేకరులపై తమకు ఎంతో గౌరవం ఉందని, అయితే ఇటీవల కాలంలో నకిలీ విలేకరులు పెరిగిపోయారని, కొంత మంది విలేకర్లమంటూ తరచూ తమ వద్దకు వచ్చి రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. తాము వారికి ప్రకటనలు ఇవ్వకపోవడంతో వారు వైసిపి నాయకులతో కుమ్మక్కై తమపై అసత్య వార్తలను ప్రచురిస్తున్నారని ఆరోపించారు. తాము నిజంగా తప్పు చేస్తే ఆధారాలను చూపించి వార్తలను ప్రచురిస్తే వాటికి తాము బాధ్యత వహిస్తామన్నారు. ఆధారాలు లేకుండా ప్రశ్నించే వార్తలను నియోజకవర్గంలోని ప్రజలు నమ్మవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

-సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరుకు రైల్వే స్టేషన్ పరిధిలో పని చేస్తున్న రన్నింగ్ రూమ్, కార్మికులు, స్లిప్పర్స్, గెస్ట్ హౌస్‌లో, రైల్వే ట్రాక్‌లో పని చేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అరకు రైల్వే స్టేషన్ రన్నింగ్ రూమ్ అధికారికి రైల్వే కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల నుండి పని చేస్తున్న కార్మికులకు రైల్వే కాంట్రాక్టర్లు చట్ట ప్రకారం జీతాలు చెల్లించకుండా రైల్వే బోర్డు ఇస్తున్న వేతనంలో కోత విధిస్తున్నారని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ పేరుతో జీతాల్లో కోత విధిస్తున్నారన్నారు. విశాఖ డిఆర్‌ఎంకి కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు, కార్మికులు

షెడ్డును ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా...

పాఠశాలకు తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రభుత్వం కనీసం పాఠశాల భవనం ఏర్పాటు చేయకుండా మెగా పేరెంట్స్, టీచర్స్ డే ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటుకు ముందుకు వచ్చారు.జిల్లాలో అనంతగిరి మండలం నాన్ షెడ్యూల్ పంచాయతీ పరిధి బూరిగ ఎంపీపీ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు వచ్చి తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. పాఠశాల మంజూరై ఏళ్లు గడుస్తున్నప్పటికీ భవనం లేక పోవడంతో ఎండాకాలంలో చెట్టు కింద వర్షాకాలంలో టార్పాలిన్ ఏర్పాటు చేసుకొని విద్య బోధనలు సాగిస్తూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి పాఠశాల భవనం మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాగేశ్వరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రతి పౌరునికి హక్కులు కల్పించే విధంగా రాజ్యాంగ రచన చేశారని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర పాలకులు సగటు సామాన్యులకు హక్కుల కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒక్కరూ హక్కులు పొందేలా ప్రభుత్వాలు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ, కర్నాటి శ్రీనివాసరావు, ధన్నూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాఫీ ఎడి అశోక్ మృతి

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఏ పీహెచ్‌ఓ, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్ శనివారం విజయవాడలో అకాల మరణం చెందారు. గత నాలుగు రోజుల నుండి గుండె నొప్పితో విజయవాడలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సహాయ ప్రాజెక్టు అధికారులు ఎం.వేంకటేశ్వర రావు. వి.ఎన్.ప్రభాకరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, కాఫీ ఏఈవో అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి నందు, జిల్లా ఉద్యానవని అధికారి రమేష్ కుమార్‌రావు తదితరులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు.

కాఫీ ఎడి అశోక్ (ఫైల్ పొటొ)

రాళ్లు తేలిన రోడ్డు

అస్తవ్యస్త రోడ్డుతో గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్ర ఒడిశా సరిహద్దు గోరాపూర్ గేడ్డలో వంతెన నిర్మించారు. కానీ కనెక్టివిటీ రోడ్డు నిర్మించక పోవడంతో రవాణా సౌకర్యానికి సర్రాయి, కంద్రుం ప్రాంత గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన నుంచి జాకర వలస వరకు సుమారు కిలోమీటర్ దూరం వరకు మట్టి రోడ్డు ఉంది. అది కూడా కొండవాగు ప్రదేశం కావడంతో వాహనదారులు పలు ఇబందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డంతా బురద మయంగా ఏర్పడుతుండటంతో ప్రయాణించే వాహనదారులు మట్టిలో జారిపోయి పలు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన నిర్మించినా కనెక్టివిటీ రోడ్డు నిర్మించకపోవడంతో రవాణా కష్టాలు గతంలో మాదిరిగా తప్పలేదని గిరిజనులు వాపోయారు. కనెక్టివిటీ రోడ్డు నిర్మిస్తే ఆ ప్రాంత గిరిజనులకు వివిధ పనుల నిమిత్తం అరకులోయకు వెళ్లడానికైనా, అనారోగ్యాల గురైన వ్యాధిగ్రస్తులను వెంటనే అరకులోయ హాస్పిటల్ కు తరలించడానికైనా, పండించిన కూరగాయలు అటవీ ఉత్పత్తులను అరకు వారపు సంతలు తరలించి విక్రయాలు చేసుకోవడానికి కూడా సౌకర్యంగా ఉంటుందని గిరిజనులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గోరపూరు వంతెన నుంచి జాకర వలస వరకు కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలని సర్రాయి, కంద్రుం ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల

సమ్మెకు మద్దతుగా 13న ధర్నా

ప్రజాశక్తి-కొయ్యూరు

రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 21 రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఈ నెల 13న పాడేరు జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్నట్లు కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మొట్టడం వలసయ్య దొర తెలిపారు. బడివైపు ఒక్క అడుగు కార్యక్రమం అనంతరం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఔట్ సోర్సింగ్ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. అదే పాఠశాలలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, గడుతూరి సత్యనారాయణ కుమారులు చదువుతుండడంతో వారు ఈ సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 191 గురుకుల పాఠశాలల్లోని మొత్తం 1,633 మంది అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, పర్మినెంట్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ చంటి బిడ్డలతో 21 రోజులుగా నిరసనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలపై ఉపాధ్యాయులు కన్నీరు పెడుతూ ధర్నాలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం పండగ చేసుకోండి అనడం సమాజానికి, విద్యార్థులకు ఏం సంకేతాలు ఇస్తున్నట్టు అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం దీనిపై కనీసం స్పందించకపోవడం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. అందుకోసం ఈనెల 13న ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ వైస్ చైర్మన్ నూకరత్నం, మెంబర్లు ఎం శంకర్రావు, సింహాచలం, సుంద్రు చిన్నబ్బాయి, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న తల్లిదండ్రులు

పాఠశాల బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-సీలేరు

చింతపల్లి క్యాంపు ఎంపీయుపీ పాఠశాలలో ఎట్టకేలకు బోరు మరమ్మతులు నిర్వహించడంతో మంచినీటి సమస్య తీరింది. జీకే వీధి మండలం చింతపల్లి క్యాంపు గ్రామ శివారునున్న పాఠశాలకు సంబంధించిన బోరు, కుళాయి పాడైపోవడంతో మంచినీటి సమస్య తలెత్తింది. ఈ సమస్యపై ప్రజాశక్తిలో కథనం ప్రచురించడంతో ముందుగా సర్పంచ్ స్పందించి కులాయి మరమ్మతులు చేపట్టడంతో శుక్రవారం నుంచి కొంతమేరకు మంచినీరు సరఫరా అయింది. శనివారం జీకే వీధి నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది బోరు మరమ్మతులు చేసి మంచినీరు సౌకర్యం కల్పించారు. బోరు మరమ్మతు పనులు సర్పంచి పాంగి దుర్గ, ఉపసర్పంచ్ కే.వల్లి ప్రసాద్ పర్యవేక్షణలో చేయించారు. బోరు నుండి, కుళాయి నుంచి మంచినీరు రావడంతో పాఠశాలలో మిడ్డేమిల్స్ నిర్వహణకు, విద్యార్థులు తాగునీరికి సమస్యలు తొలిగాయి. సకాలంలో ప్రజాప్రతినిదులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు ఉపాధ్యాయులు భగీరథ కృతజ్ఞతులు తెలిపారు.

బోరు మరమ్మతులు చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది

అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి కొలతలు వేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో అంగన్వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద రూ.10 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ పాంగి దుర్గో తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ శనివారం చింతపల్లి క్యాంపు అంగన్వాడీ కేంద్ర నిర్మాణానికి కొలతలు వేశారని తెలిపారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారుడు ఎ.అప్పలనాయుడు, సబ్ కాంట్రాక్టర్ పి.పాపారావుకి పనులు అప్పగించినట్లు చెప్పారు. ఈ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇంతవరకు అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేకపోవడంతో అనేక ఇబ్బందులు గురయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా అంగన్వాడి కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో సమస్యలు తీరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే. వల్లి ప్రసాద్, అంగన్వాడీ టీచర్ ఈశ్వరి, సబ్ కాంట్రాక్టర్ పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలు

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోని ఫజ్జులబాద్‌లో ఉన్న సుబ్రమణ్య స్వామి షష్టి సందర్భంగా ఐదు రోజులు వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు అధిక సంఖ్యలో సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మధ్యాహ్నం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం దంపతులు, సబ్ కలెక్టర్ కల్పనశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ పావని, రెవిన్యూ సిబ్బంది సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఎస్సై షరీఫ్ ఆధ్వర్యాన పోలీసులు ఎటవంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం దుప్పిలివాడ సచివాలయం పరిధి వలసగెడ్డ, వలస గెడ్డకొత్తూరు, శాండికోరి, బూషికొండ తదితర గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ ప్రతి నెల ఎంపికైన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు వయసు పైబడిన వారు తప్పనిసరిగా బీపీ, షుగర్, ఇతరు పరీక్షలు చేయించుకుంటే ప్రమాదకర వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కలుషిత నీరు తాగరాదన్నారు. జ్వరాలు ఇతర వ్యాధులు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా స్థానిక ప్రభుత్వాసుపత్రికి సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షలు బి.బాలమణి, వైద్య సిబ్బంది సత్యనారాయణ, కుమారి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం

రవ్వలగూడ పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపిడిఒ లవరాజు

ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం పండుగ వాతావరణంలో జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని, పాఠశాలలు, విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు వివిధ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులును అందజేశారు. సహఫంక్తి భోజనాలు చేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ప్రజాశక్తి- అరకులోయ: క్రమశిక్షణతో కూడిన విద్య నభ్యసించడంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అరకులోయ ఎంపీడీవో లవరాజు అన్నారు. మండలంలోని రవ్వలగూడ గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాలలో శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్. పి. కెందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని విద్యను అభ్యసించాలన్నారు. రవ్వలగూడ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థుల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కొనియాడారు. .విద్యార్థులు చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎంఈఓ వి.త్రినాధరావు మాట్లాడుతూ, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలు బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. విద్యార్థులు వేసిన వివిధ కళా ప్రదర్శనలు, సాహస ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.చలపతిరావు, గన్నెల, మాడగడ వైద్యురాలు కమల, అడ్వకేట్ బుజ్జిబాబు, ఏపీఎస్ ప్రతినిధి మోహన్, విద్యా కమిటీ చైర్మన్‌లు పాపారావు, బాలమ్మ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సిఏహెచ్ స్కూల్‌లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఆ పాఠశాల హెచ్ఎం దయానిధి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

డుంబ్రిగుడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో గిరిజన సాంప్రదాయ దింసా నృత్యంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సైన్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు.విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి సునీత, కేజీబీవీ పాఠశాలలో స్పెషల్ అధికారిని భవాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, ఎంపీటీసీ ఎం.గీత, వైయస్సార్ టిఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సుబ్బారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని 204 పాఠశాలల్లో టీచర్స్, పేరెంట్స్ మెగా సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల స్థితిగతులు, పాఠాల బోధన వివిధ ప్రావీణ్యాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. పలు పోటీలు నిర్వహించారు.

అనంతగిరి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. చిలకలగెడ్డ బాలుర పాఠశాలలో ఎంపీపీ శెట్టి. నీలవేణి పాల్గొన్నారు.

శివలింగపురం, అనంతగిరి బాలికల పాఠశాలలో జెడ్పిటిసి దీసరి. గంగరాజు మాట్లాడుతూ, ఏజెన్సీ మారుమూల పాఠశాలల్లో కనీస భవనాలు లేక ఆరుబయట చెట్ల కింద తార్పాలిన్లు ఏర్పాటు చేసుకొని విద్యా బోధనలు సాగించవలసిన దుస్థితి నెలకొందన్నారు. గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 20. రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఏఎన్ఎంలు లేక విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తున్నారని చెప్పారు.

చింతపల్లి: విద్యార్థులు చదువు విలువ తెలుసుకొని భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం.విజయ భారతి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం శనివారం స్థానిక బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, మంచి మార్కులు తెచ్చుకునేందుకు విద్యలో పోటీ తత్వం ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

ఆర్‌వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన చింతపల్లి సబ్ సెంటర్ వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల 2, బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో శనివారం ఘనంగా తల్లిదండ్రుల, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఆటల, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జ్ఞాన ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మి, వార్డెన్ వసంత పాల్గొన్నారు,

రంపచోడవరంలో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఇందులో రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ట్రైనింగ్ కలెక్టర్ భావన, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ డి.సురేందర్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పిఒ సింహాచలం మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు కన్యాశులకం నాటకాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల తల్లులతో ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వమించి బహుమతుల ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు యం.నాగేంద్ర భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ పి.స్రవంతి, హెచ్ఎం యం.పద్మవతి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, సబ్ ఇన్స్పెక్టర్ షరీఫ్, ఫిజికల్ డైరెక్టర్ కె. భవాని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలం పెద్దగెద్దాడ ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో ఎంపిడిఒ, ఐసీడీఎస్ సీడీపిఒ పాల్గొన్నారు. ఆటలు, పాటలు పోటీల్లో నిర్వహించి గెలుపొందిన తల్లిదండ్రులకు, పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రాథమిక, ఉన్నత, ఏకలవ్య, ఏపీఆర్ స్కూల్లో ఉదయం నుండి పండగ వాతావరణం నెలకొంది. పలు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఘన స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. తల్లిదండ్రులతో ఆటపాటలు నిర్వహించారు.

విఆర్.పురం : మండలంలో అన్నవరం పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ బుర్రా కన్నారావు, వైస్ చైర్మన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయురాలు నాగమణి విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి డాన్సులు జరిగాయి. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. s ఏఎన్ఎం పార్వతి, అంగన్వాడీ టీచర్లు బురక కృష్ణవేణి, మడకం శైలజ, హెల్త్ వర్కర్స్ ఉయిక నూతన, రాధ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందని మండల ప్రత్యేక అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు అన్నారు. స్థానిక జెడ్పి హైస్కూల్‌లో హెచ్ఎం డివి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్, సీఐ ఎన్ సన్యాసినాయుడు, తాహశీల్దార్ ఏ సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎస్ఐ నరసింహమూర్తి పాల్గొన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు.

సీలేరు : జీకేవీధి మండలం రింతాడ గిరిజన ట్రైబల్ వెల్ఫేర్, పెదవలస పాఠశాలలో తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు ఆత్మీయ కలియక జరిగింది. ఇందులో జీకేవీధి మండల తహసిల్దార్ రామకృష్ణ, వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు, ప్రధానోపాధ్యాయులు కే.సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలు, దారకొండ, చప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ఆత్మీయకలయిక కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్సై కే.రవీంద్ర, సర్పంచి దుర్జో, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఉపసర్పంచ్ కే. వల్లి ప్రసాద్ కూటమి నాయకులు చిటికెల రాము, గోవిందు, బాలు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోనిమర్రిగూడెం జెడ్‌పిహెచ్ఎస్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ వెంకట్రావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ కృష్ణ కుమారి, శ్రీమంతుల సతీష్, నస్కూరి ధర్మయ్య, శ్యామ్,దిలీప్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : అడ్డతీగల గురుకులం, జడ్పీ హైస్కూల్ జరిగింది పేరెంట్ మీట్‌లో సీఐ నరసింహారావు పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వల్ల వచ్చే అనర్ధాలు పై అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని సున్నంవారిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ఇన్చార్జి హెచ్ఎం జల్లి బాబురావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఎస్ఎంఎస్ కమిటీ చైర్మన్ పూసం సత్యనారాయణ, ఐసిడిఎస్ సిడిపివో రాణి, వార్డెన్ సోడే వీర్రాజు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఎస్సై షరీఫ్, తహసిల్దార్ టి సత్యనారాయణ, ఎంపీడీవో రత్నకుమారి, ప్రధానోపాధ్యాయులు ముత్యాలరావు, ఎస్ఎంసి చైర్మన్ సామి రెడ్డి వీరభద్ర రామకృష్ణ పాల్గొన్నారు.

కొయ్యూరు : మెగా పేరెంట్స్ డే మండలంలో అన్ని స్కూల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లి గ్రామంలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఇందులో విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరిలో బహుమతులిస్తున్న జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

విఆర్.పురంలో ముగ్గుల పోటీల్లో విద్యార్థులు, వారి తల్లులు

దేవీపట్నంలో తల్లిదండ్రుల సమావేశం

సీలేరులో టగ్ ఆఫ్ వార్ పోటీలో ఉత్సాహంగా తల్లిదండ్రులు

కొయ్యూరు మండల చౌడుపల్లిలో పేరెంట్స్ సమావేశం

ఆంధ్రా యూనివర్శిటీ అల్యుమిని మీట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్- 2024 శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టి చైర్మన్ ఎస్ఎన్.సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులు నూతన అవకాశాలకు నాందిగా నిలుస్తాయని చెప్పారు. ఎయు ఎఐ ల్యాబ్‌ను సందర్శించిన సమయంలో అక్కడ యువత ఎంతో ఆసక్తికరంగా తమ ఆవిష్కరణ వివరించారని చెప్పారు. నిర్మాణ రంగంలోకి యువత రావడానికి ఆసక్తి చూపడం లేదని, దీంతో ప్రతిభను కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెప్పారు. నిర్మాణ రంగంలో కార్మికుల కొరత కూడా భారత్‌లో అధికంగా ఉందని చెప్పారు.

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఆంధ్రా యూనివర్శిటీ గత వైభవాన్ని తిరిగి పొందడమే కాకుండా భారతదేశంలో టాప్ -3, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో ఒకటిగా నిలిపేందుకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త సిఆర్ రావు, యుజిసి మాజీ వైస్ చైర్మన్ బిఆర్.రావు, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, జిఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు, నీలి బెండపూడి, బివిఆర్ మోహన్ రెడ్డి, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్ పూర్ణ సగ్గుర్తి వంటి ప్రముఖులు సాధించిన విజయాలు ఆంధ్ర విశ్వవిద్యాలయ వారసత్వానికి నిదర్శనం అన్నారు. అల్యూమిని ప్రముఖుల వృత్తిపరమైన, వ్యక్తిగత అనుభవాలు, మార్గదర్శకత్వం, ప్రగతిశీల ఆలోచనలు ప్రస్తుత విద్యార్థులు, యువత కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపయోగపడతాయని తెలిపారు. అధునాతన ఆవిష్కరణలు, పరిశోధనల కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీని ముందువరుసలో నిలిపేందుకు అల్యూమిని ప్రముఖులంతా ధృడమైన సంకల్పంతో ముందుకురావాలని కోరారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీ అల్యుమిని మీట్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రయంలో ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జిఎం.రావు, ప్రత్యేక అతిథి పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎయు వీసీ ఆచార్య జి శశిభూషణరావు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పంచకర్ల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఏయు సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. పలువురు విదేశీ విద్యార్థులు తమ సంస్కృతులను తెలియజేస్తూ చేసిన నృత్యాలు, యోగా విద్యార్థులు చేసిన రూపకం ఆకట్టుకున్నాయి.

జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : బెంగళూరులోని శ్రీ కంటీరవ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఎల్ఐసి ఆఫ్ ఇండియా విశాఖపట్నం డివిజన్‌లో పనిచేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై శర్మను బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ మేనేజరు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ అభినందించారు.

8 నెలల తర్వాత తీరిగ్గా..

పోర్టుకు చేరుకున్న వివాదస్పద కంటైనర్ (ఫైల్)

- తొలుత గగ్గోలు పెట్టి నేడు ఏమీ లేదని తేల్చారు...
- సిబిఐ విచారణ భాగోతానికి నిలువుటద్దం
- విశాఖ పోర్టుకు వచ్చిన రూ.కోట్ల విలువైన డ్రై ఈస్ట్‌పై 'మీనమేషాలు'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కొండను తవ్వి ఎలుకను పట్టారు... అన్నది మామూలుగా సామెత. కానీ ఇక్కడ జరిగింది చూస్తే విస్మయం కలుగక మానదు. 8నెలల తర్వాత కూడా కనీసం ఎలుకను సైతం పట్టలేదు సిబిఐ అంటూ విశాఖ, రాష్ట్రంలోనూ ప్రజల్లో చర్చ సాగుతోంది. ఆ నౌకలో డ్రగ్స్ ఏమీ లేవని సిబిఐ నివేదికను ఈ నెల 6న ఇవ్వడం చూస్తే ఈ విషయం చెప్పడానికి 8 నెలలు సిబిఐ లాంటి సంస్థకు సమయం పట్టిందా? అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు విషయానికొస్తే బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్ దిగుమతి చేసుకున్న నౌక విశాఖ పోర్టుకు 2024 మార్చి 19న వచ్చిందని ఎన్నికల ముందు టిడిపి, జనసేన, బిజెపి కూటమి గగ్గోలు పెట్టిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ గరుడ పేరుతో సిబిఐ విచారణ చేపట్టింది. అప్పుడు అధికారంలో ఉన్న వైసిపి వైజాగ్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ఏ ఒక్క కూటమి పార్టీ నాయకులూ మాట్లాడకపోవడం విశేషం. ఈ నెల 6న సిబిఐ తన విచారణ నివేదికను బయటపెట్టింది. అందులో డ్రగ్స్ లేవని చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అప్పట్లో రూ.లక్ష కోట్ల డ్రగ్స్ ఉన్నాయంటూ ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ పెద్దలు ఆరోపించడం తెలిసిందే. రాష్ట్ర ప్రజల్లో ఎన్నికల ముందు ఈ అంశం ఎంతగానో ప్రభావితం చేసిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వాస్తవానికి అప్పట్లో 49 శాంపిల్స్ తీస్తే డ్రగ్స్ నమూనా ఉందని సిబిఐ అధికారులు ప్రాథమికంగా చెప్పి 8 నెలల తర్వాత మాటమార్చేశారన్న విమర్శలు కేంద్ర సంస్థ తీరుపై వినిపిస్తున్నాయి.

ఆ సంస్థ ఎవరిది? ఏం చర్యలు తీసుకున్నారు?

ఇనాక్టివ్ డ్రై ఈస్ట్‌ను సంధ్యా ఆక్వా మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ విశాఖ పోర్టుకు షిప్‌లో బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకుందన్నది వాస్తవం. దీంట్లో నార్కోటిక్స్ ఉన్నాయంటూ జరిగిన ప్రచారంపై విచారణ చేపట్టడం జరిగిందా? అప్పట్లో బిజెపికి చెందిన వారిపైనా ఆరోపణలు వినిపించాయి. కేంద్రంలో టిడిపికి బిజెపి అండ ఉండడంతో తమపైకి ఈ నౌక ఘటనను నెడుతున్నారంటూ వైసిపి రాష్ట్ర, విశాఖ నేతలు ప్రత్యారోపణలూ చేశారు. సిబిఐ నివేదిక తర్వాత ప్రజలకు ఏం అర్థమైంది.? ఎన్నికల సమయంలో కాబట్టే ఈ నౌక రాక పెద్ద ఎత్తున ప్రాచుర్యం పొందిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 40 అడుగుల గల ఈ నౌకలో 25 కిలోల చొప్పున డ్రై ఈస్ట్ అంటే రొయ్యల ఆహారంలో వినియోగించే పదార్థాలు 25 కిలోలకు పైగా ఉన్నాయన్నది తొలుత తేల్చారు. చర్యల దిశగా ఎన్నికలనంతరం సిబిఐ గానీ ప్రభుత్వాలు గానీ చొరవ చేయలేదు. తీరిగ్గా ఇప్పుడు నివేదిక ఇచ్చేసి తమ పని అయిపోయిందని పించుకోవడం విశేషం.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు : విద్యార్థులకు మత్తు పదార్థాలు, గంజాయి, ఆల్కహాల్ వంటి వాటికి బానిసలు కావద్దని, వాటికి దూరంగా ఉండాలని సీలేరు ఎస్సై కే.రవీంద్ర పేర్కొన్నారు. జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ రవీంద్ర శనివారం విద్యార్థులతో సమావేశమై, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. చెడు మార్గాలు విడనాడి మంచి మార్గంలో విద్యార్థులు నడవాలని, విద్యపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలపై సమాజంలో పూర్తిస్థాయి అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాలు పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. సెల్‌ఫోన్లకు ఎటువంటి లింకులు వచ్చినా ఓపెన్ చేయరాదని, అలా చేసినట్లయితే బ్యాంక్ ఖాతాలో సొమ్ములు సైబర్ నేరగాళ్లు క్షణాల్లో కాజేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శంకరరావు, అధ్యాపకులు సాయిరాం శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ రవీంద్ర

గూడెం కొత్తూరు పాఠశాలలో..

పిల్లలు మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా నియంత్రించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జీకే వీధి సిఐ వరప్రసాద్ అన్నారు. జీకే వీధి మండలం గూడెం కొత్తూరు ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి గుట్కా ఖైని తదితర మత్తు పదార్థాలకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-ఎంవిపీ కాలనీ : ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని, 2025 జనవరి 1వ తేదీ నుంచి విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సహకరిస్తూ, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తామంటూ స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలని ప్రముఖ ఫిలిం సెలబ్రిటీ స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ఆర్‌పి.పట్నాయక్ ప్రజలకు పిలుపునిచ్చారు. జివిఎంసి ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్ వేదికగా మత్స్యదర్శిని సమీపంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌తో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పి.పట్నాయక్ మాట్లాడుతూ విశాఖ ప్రకృతి ప్రసాదించిన పర్యావరణహితపరమైన పచ్చని నగరమని, ఈ నగరాన్ని ప్లాస్టిక్ రహిత విశాఖ నగరంగా తీర్చిదిద్దుకునే బాధ్యత విశాఖ ప్రజలపై ఉందని అన్నారు. రోజురోజుకు కొండగుట్టల్లా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వస్తువులు ప్రజల ఆరోగ్యానికి, మూగ, జల జీవాలకు హాని కలిగిస్తూ ఈ నగరాన్ని కలుషితం చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. జివిఎంసి ప్లాస్టిక్ నిషేధంపై చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ అవగాహనతో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తామంటూ నగర ప్రజలు శపథం చేస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్‌కె.బీచ్ సముద్ర తీర ప్రాంతంలో జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి వ్యర్థాలను వెలికి తీశారు. జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ, కమిషనర్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను 2025 జనవరి 1వ తేదీ నుంచి నిషేధిస్తున్నట్లు తెలిపారు. అందుకు ప్రజలు, వినియోగదారులు, వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2, 3, 4 జోనల్ కమిషనర్లు ఎమ్‌విడి.ఫణిరామ్, కె.శివప్రసాద్, ఎమ్.మల్లయ్యనాయుడు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో రైళ్ల రద్దు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రాంచీ డివిజన్‌లోని సోరంతోలి చౌక్ స్టేషన్‌లో 4 లేన్ల రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ కారణంగా 18311 విశాఖపట్నం- బనారస్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 22వ తేదీన, 18312 బనారస్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను 23వ తేదీన రద్దు చేసినట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

ఘనంగా శ్రీ చైతన్య నాలెడ్జ్ హబ్ స్కోర్ ఫెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డాబాగార్డెన్‌లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో శ్రీ చైతన్య అకాడమీ నాలెడ్జ్ హబ్ స్కోర్ ఫెస్ట్ వేడుకను శనివారం నిర్వహించారు. ఇటీవల జరిగిన స్కోర్ ఫెస్ట్ పరీక్షలో నగర పరిధిలోని 43 స్కూళ్ల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనగా 22 మంది ప్రతిభా స్కాలర్‌షిప్ పురస్కారం కింద నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రాంతీయ అకడమిక్ డైరెక్టర్ నాగరాజు, ప్రాంతీయ వ్యాపార అధిపతి జి.వేణుగోపాల్‌రెడ్డి, క్లస్టర్ బిజినెస్ హెడ్ జి.విశ్వనాథ్, బ్రాంచ్ హెడ్ మద్దాల అరుణ్ స్వరూప్, అకడమిక్ హెడ్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, నాలెడ్జ్ హబ్ సెంటర్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించి నీట్ 2024లో 18 మంది విద్యార్థులు 700/720 కంటే ఎక్కువ స్కోర్ చేశారని, 85 శాతం మంది టాప్ పర్సంటైల్‌లో ర్యాంకులు సాధించారని తెలిపారు. జెఈఈ-మెయిన్స్ 2024లో 72 శాతం మంది విజయం సాధించారన్నారు. జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించి 40 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో ప్రవేశాలు పొందారని వివరించారు. 11, 12 తరగతులకు నీట్, ఐఐటి- జెఈఈకి కోచింగ్ అందివ్వటం, 7 నుంచి 10 తరగతులకు ఫౌండేషన్ కోర్సులు, ఒలింపియాడ్స్ ఇతర పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ ఇవ్వడం శ్రీ చైతన్య అకాడమీ ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ క్రీడలకు ఎఎంసి విద్యార్థులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తరపున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఆంధ్ర మెడికల్ కళాశాల 2021 బ్యాచ్‌కి చెందిన సి.కరుణాకర్ రాజు తిరువనంతపురంలో ఎంపికయ్యారు.